క్లుప్తంగా

ఎరువుల గోదాముల తనిఖీ



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని బుడంపాడు గ్రామంలోని అవేజ్ గోదాములను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసులు తనిఖీ చేశారు. గోదాములోని రిజిస్టర్లు, స్టాక్ పరిశీలించారు. గోదాములోని ప్రతి లాట్‌ను పరిశీలించి ప్రతి లాట్‌లో శాంపిల్‌ను తీయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రహ్మణ్యాన్ని ఆదేశించారు.

రేపు రెండు గ్రామాల్లో ఉపసర్పంచి ఎన్నికలు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ, తురకపాలెం గ్రామాల్లో ఖాళీలైన ఉపసర్పంచి స్థానాలకు ఈనెల 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కె.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జొన్నలగడ్డ గ్రామానికి ప్రత్యేక అధికారిగా కె.శ్రీనివాసరావు, తురకపాలెం గ్రామానికి కె.రమేష్ విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలు ఉంటుందని అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

కొండేపాడు(ప్రత్తిపాడు): ట్రాక్టర్ ట్రక్కు కింద పడి మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. కొండేపాడులో మృతి చెందిన మహిళల మృతదేహాలకు మంగళవారం అరుణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కాకుమాను: వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న దృష్ట్యా ఏ గ్రామ వీఆర్వోలు ఆయా గ్రామాల రైతులకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మరో కొద్ది రోజులలో ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీఆర్వోలు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంటు వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

క్యారమ్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రత్తిపాడు: ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్యారమ్స్, నృత్య పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో జూనియర్ విద్యార్థిని జ్ఞానసిరి ప్రథమ బహుమతి సాధించింది. అనంతరం జరిగిన క్యారమ్స్ పోటీల్లో 6వ తరగతి విద్యార్థిని జి.హేమలత మొదటి స్థానం, డి.రేణుకృష్ణసాయి ద్వితీయ స్థానం సాధించారు. వీరికి అరుణ బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న గంగాస్తోత్రం ప్రవచనం

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సుందర సత్సంగ్ సభ్యులు కె.వి. కోటేశ్వరరావు మంగళవారం ఆదిశంకరాచార్య గంగాస్తోత్రంపై ప్రవచనం చేశారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కె.వి. కోటేశ్వరరావుని ఘనంగా సత్కరించి, స్వామివారి ప్రసాదం అందించారు.

బిల్డింగ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

పట్నంబజారు: బిల్డింగ్‌పై నుంచి కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణభారతీనగర్‌కు చెందిన వినుకొండ కృష్ణబాబు(22) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం వికాస్‌నగర్‌లోని ఓ బిల్డింగ్‌లో పనికి వెళ్లి చెక్కలు తీస్తున్న క్రమంలో ఐదో అంతస్తు నుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీరు మున్నీరైన కొండేపాడు పల్లె

- మిన్నంటిన ఆర్తనాదాలు
- ఏడుగురి దుర్మరణంతో విషన్నవదనాలతో దళితవాడ
- మృతులకు అంత్యక్రియలు పూర్తి



ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికలో మృతుల ఖనన కార్యక్రమాలు

కొండేపాడు(ప్రత్తిపాడు): నేనేం పాపం చేశాను అమ్మా నన్ను వదిలి వెళ్లిపోయావ్ అంటూ మంచానికే పరిమితమైన పాతికేళ్ల కుమారుడు.. మమ్మల్ని ఒంటరి వాళ్లను చేసి అప్పుడే దేవుడి దగ్గరకు వెళ్లావా అమ్మా.. అంటూ రోధించే కుమారులు, నాన్నా.. అమ్మ ఇక రాదా అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న కుమార్తెను ఓదార్చే బంధువులు, కొత్త ఇళ్లు కట్టుకుని హాయ్‌గా ఉందామని చెప్పి.. సమాధిలోనికి వెళుతున్నావా అమ్మా.. అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చే మరో కూతురుతో.. ఈ కష్టం ఏ పల్లెకూ రాకూడదు 'ఏసయ్యా..' అంటూ రెండు చేతులూ జోడించి దీనంగా బంధువులు రోదిస్తున్నారు.. కొండేపాడు ఎస్సీకాలనీ ఏర్పడి సుమారు ఆరు దశాబ్దాలు దాటిపోతుంది. ఇప్పటి వరకు కాలనీలో ఇంతటి ఘోరం జరగనేలేదు. మహిళలే మృత్యువు ఒడికి చేరడంతో పరిస్థితి హృదయ విదారకంగా మారింది. పొన్నూరు మండలం జూపూడిలో శుభకార్యానికి వెళ్తూ వట్టిచెరుకూరులో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో కొండేపాడుకు చెందిన మిక్కిలి నాగమ్మ(55), గనికపూడి మేరమ్మ (50), గనికపూడి రత్నకుమారి(55), కట్టా నిర్మల(55), గనికపూడి సుహాసిని(40), మామిడి ఝాన్సీ రాణి(46), గనికపూడి సలోమి(55)లు మృతిచెందిన విషయం తెలిసిందే.

ఒకరి తర్వాత ఒకరికి అశ్రునివాళి..

ఒకరి తరువాత మరొకరిని ఖననానికి తరలించడంతో పల్లె పల్లెంతా వెంట నడిచింది. మాతృమూర్తీ నీకు ఇవే అశ్రునివాళి.. అంటూ తోటి వారు, సహచరులు, స్నేహితులు, చిన్నా, పెద్ద తేడాలేకుండా అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దళితవాడలో ఐదు ప్రధానమైన బజార్లు ఉండగా ప్రతి బజారులోనూ మరణించిన వారు ఉండటంతో పరిస్థితి దయనీయంగా కనిపించింది. దానికి తోడు శ్మశాన వాటిక సైతం చిన్నది కావడంతో మృతులను ఖననం చేసేందుకూ కొంత ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉన్న కొద్ది జాగాలో అతి జాగ్రత్తగా ఖననం చేయాల్సి వచ్చింది. గుంతపక్కనే గుంత తీసి మృతదేహాలకు అంత్యక్రియలను పూర్తి చేశారు. ఖనానానికి గుంతలు తీయించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పొక్లెయిన్‌ను తీసుకువచ్చి గోతులు తీయించి ఖనన కార్యక్రమాలు ముగించారు.

అధైర్య పడకండి అండగా ఉంటాం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత దంపతులు

కొండేపాడు(ప్రత్తిపాడు): అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మృతుల కుటుంబాలను మంగళవారం ఓదార్చారు. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో సోమవారం మృతి చెందిన మిక్కిలి నాగమ్మ, గనికపూడి మేరమ్మ, గనికపూడి రత్నకుమారి, కట్టా నిర్మల, గనికపూడి సుహాసిని, మామిడి ఝాన్సీ రాణి, గనికపూడి సలోమి మృతదేహాలకు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వంతో పాటు తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమె వెంట భర్త దయాసాగర్, ఎంపీపీ దాసరి అన్నమ్మ, గ్రామ సర్పంచి నర్రా రాంబాబు ఉన్నారు.

సీబీఐ మాజీ డైరెక్టర్ ప్రకటనపై కేంద్రం స్పందించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె. రామకృష్ణ

పాత గుంటూరు: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంపై సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఇచ్చిన ప్రకటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. మంగళవారం గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రమాదంలో ఎక్కడ పొరపాటు జరిగిందో, ఎవరు బాధ్యులు, సాంకేతిక లోపంపై విచారణ జరపకుండా మతాన్ని కించపరిచే విధంగా, మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా, మైనార్టీలను అనుమానించే పద్ధతుల్లో ఆర్ఎస్ఎస్ బీజేపీ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారానికి తెర లేపారని అన్నారు. ప్రస్తుతం దేశమంతా రైలు ప్రమాదంపై చర్చ జరుగుతుండటంతో తమ తప్పిదాన్ని, చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకుంటూ మరోవైపు మైనార్టీ మతస్తులను దోషులుగా నిర్ణయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. నరేంద్రమోదీ, సీబీఐ మాజీ డైరెక్టర్ ఇచ్చిన ప్రకటనపై వెంటనే స్పందించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్, కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. స్వర్ణభారతీ నగర్‌కు చెందిన గల్లా నాగ విజయ కుమార్(50) పాత గుంటూరుకు చెందిన ఉదయ లక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు. గత కొంతకాలంగా విజయ కుమార్ మద్యానికి బానిస కావటంతో ఇంట్లో భార్యాభర్తల మధ్య మనస్పార్థలు వచ్చాయి. భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మద్యం మత్తులో మనస్తాపానికి గురైన విజయ్‌కుమార్ సోమవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారివద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటన దురదృష్టకరమని, ఈ దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 238 మందికిపైగా ఈ దుర్ఘటనలో మృతి చెందడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ సిగ్నల్ వ్యవస్థను కూడా ప్రైవేటుపరం చేయడం వలన రైలు ప్రమాదం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, సీనియర్ నాయకులు వై.కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, అమ్మిశెట్టి రంగారావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వైద్యాధికారులు డాక్టర్ ఎం.ఇన్నారావు, డాక్టర్ ఎం. కృష్ణవేణిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దోమకాటుకు దూరంగా ఉండాలంటే దోమతెరలు వాడాలని, ఖాళీ ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వాడిపడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. వాటర్ ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసుకోవాలని, వాటిపై మూతలు ఏర్పాటు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంచితే దోమలు వృద్ధి చెందుతాయని, దోమలను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి విజయ భాస్కర్, పీహెచ్.ఎన్ వందనాదేవి, సూపర్‌వైజర్ వీరయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణపై అవగాహన

మేడికొండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌హెచ్–167 జాతీయ రహదారి విస్తరణ చేపట్టనున్నారు. మండల పరిధిలోని మంగళగిరిపాడు, కొర్రపాడు గ్రామాల పరిధిలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డెప్యూటీ కలెక్టర్ నారాయణశర్మ హాజరయ్యారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన పొలాల సేకరణ, మార్కెట్ విలువకు లోబడి రైతులకు పరిహారం అందించడం జరుగుతోందన్నారు.

పాఠశాల హెచ్‌ఎం ధనరాజుకు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిశోధకుడు, కర్నూలు జిల్లా పెద్దమరివీడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ధనరాజుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎడ్యుకేషన్ విభాగ పరిశోధనా పర్యవేక్షకురాలు డాక్టర్ సి గ్రేస్ ఇందిర పర్యవేక్షణలో 'ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం, బోధనాసక్తి, ఉపాధ్యాయుల సమర్థత' అనే అంశం పై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు.

సురేష్ కుమార్‌కు..



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధకుడు పీజీవీ సురేష్ కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ షాహేదా అక్తర్ పర్యవేక్షణలో 'ఏ కాంప్రెహెన్సివ్ స్టడీ ఆఫ్ ఫ్యూచర్ సెలక్షన్ ఫర్ ఐడీఎస్ యూజింగ్ మెషీన్ లెర్నింగ్ అప్రోచస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. అందుకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని చెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

పట్నంబజారు: అధిక ఉష్ణోగ్రతతో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్టీఆర్ జిల్లా దొండపాడు గ్రామానికి చెందిన ఆరుమండ సుమన్(51) ఈనెల 5న పెదకాకాని గుడికి వెళుతున్నానని చెప్పి గుంటూరు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పూటుగా మద్యం తాగి బయటకు వచ్చి అధిక ఉష్ణోగ్రత కారణంగా అక్కడిక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి భార్య సమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ పంపిణీ

గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట 4వలైనులో బాటసారులకు మజ్జిగను మంగళవారం పంపిణీ చేశారు. వేసవి కాలం ప్రారంభం నుంచి గుంటూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఫౌండర్ పవన్ తెలిపారు. అన్నదానం కార్యక్రమం 50 రోజులుగా గుంటూరులో చేస్తున్నట్లు వెల్లడించారు.

వృద్ధులకు నిత్యావసరాల కిట్లు అందజేత

నెహ్రూనగర్: ఇంటర్నేషనల్ యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో ఏటుకూరులో రోడ్డులోని మమ్మీ డాడీ ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అవసరమైన నిత్యావసరాలు కిట్లను అసోసియేషన్ నాయకులు మంగళవారం అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ ఏజేసీ శోభన్‌బాబు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అవసరమైన కిట్లు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పీజే శామ్యూల్, ట్రెజరర్ ప్రకాష్ పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత తప్పనిసరి

తాడికొండ: డెంగీ వ్యాధిని అరికట్టేందుకు అప్రమత్తత అవసరమని తుళ్లూరు మండలం వైద్యాధికారి డాక్టర్ కె.తిరుమలదేవి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని పొన్నెకల్లు పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మరో వైద్య అధికారి డాక్టర్ సాయికృష్ణ భార్గవ్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎంపీ అయోధ్యరామిరెడ్డి పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రమాదవశాత్తులో వట్టిచెరుకూరులో ట్రాక్టర్ బోల్తాపడి ఏడుగురు మృతి చెందడం ఎంతో బాధాకరమని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాతో కలసి మంగళవారం పరామర్శించారు.ఎంపీ మాట్లాడుతూ ఈ ఘటన ఎంతో బాధాకరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు రాగా, అత్యంత మెరుగైన వైద్యాన్ని బాధితులకు అందజేశారన్నారు. ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. మరో రెండు రోజుల్లో వారిని డిశ్చార్జి చేస్తారని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించి పలు మరమ్మతులు ఉన్న నేపథ్యంలో రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధులతో పాటు, ఇతర నిధులు కలిపి రూ.20 లక్షలు ప్రకటించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: మల్లారెడ్డి నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర, కుమారస్వామి సహిత ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి, విద్యాసరస్వతి, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాలు, అనేక సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పర్వతవర్ధిని అమ్మవారికి అభిషేకార్చనలు ఋత్వికులు వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నవగ్రహారాధన, నవగ్రహ హోమాలను నిర్వహించారు. సాయంత్రం సుబ్రహ్మణ్య హోమం, శ్రీ సూక్త హోమం అనంతరం పర్వతవర్ధిని అమ్మవారికి, సుబ్రహ్మణ్యస్వామికి సహస్ర నామార్చన, విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి పాల్గొన్నారు.

కేఎల్ విశ్వవిద్యాలయానికి 28వ ర్యాంకు

తాడేపల్లిరూరల్ : అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో కేఎల్ విశ్వవిద్యాలయానికి 28వ ర్యాంక్ వచ్చినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. మంగళవారం వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో 44వ ర్యాంక్‌ను, దేశంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లలో 52వ ర్యాంక్‌ను సాధించడంతోపాటు ఓవరాల్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో 50వ ర్యాంక్‌ను తమ విశ్వవిద్యాలయం సాధించిందని వివరించారు. భారతదేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 28వ ర్యాంక్ సాధించినందుకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ గుర్తింపు విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణల పట్ల తమ అచంచలమైన నిబద్ధతకు నిలువెత్తు నిదర్శమన్నారు. ఇది తమ విద్యాసంస్థలోని అంకిత భావం కలిగిన అధ్యాపకుల సమష్టి కృషి, ప్రతిభావంతులైన విద్యార్థులు, సహాయక సిబ్బంది కలసి తమ విద్యాసంస్థను ఇంతటి గొప్ప విజయాన్ని తీసుకు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటికలో హైమాస్ట్‌లైట్ ఏర్పాటు



హిందూ శ్మశానవాటికలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న దామేష్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక హిందూ శ్మశాన వాటికలో మంగళవారం కార్పొరేషన్ నిధుల నుంచి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికను దాతలు, కార్పొరేషన్ నిధులతో గతంలో అభివృద్ధి చేశామని, శ్మశాన వాటికలో రాత్రి సమయంలో అసాంఘిక వ్యక్తులు మద్యం సేవించడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకువెళ్లామని వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవితో మాట్లాడి రూ.6లక్షల వ్యయంతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భవనం ప్రభాకర్‌రెడ్డి, చిన్ని, మేకా అంజిరెడ్డి, బొక్కా ప్రసన్నకుమార్ (నాని), ఎస్కె బషీర్, అన్నూరు సుబ్బారావు, భుజంగరావు, మురళి, మేకా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించిన అధికారులు

- పలుచోట్ల మరమ్మతులు, కొత్తపైపులు ఏర్పాటు
- కొలనుకొండలో ఆరు పబ్లిక్ ట్యాప్‌లు



కొలనుకొండలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ ట్యాప్, నీరు పట్టుకుంటున్న స్థానికులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాగునీటి సమస్యలపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్ల నుంచి సరిగా తాగునీరు సరఫరా కాకపోవడంతో వాటికి మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కొలనుకొండలో అస్తర్‌నగర్‌లో పబ్లిక్ ట్యాప్‌లు లేకపోవడంతో స్థానికంగా ఉన్నవారు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఆయన నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ఆరు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ వార్డులో పలు ప్రాంతాల్లోనూ, పద్మశాలీయులబజారులో పాత పైపులైన్లు నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహానాడు ప్రాంతంలో రూ.10 లక్షల వ్యయంతో పలుచోట్ల కొత్త పైపులైను పనులు ప్రారంభించారు. 2వ వార్డులో నెమలికంటి సత్యవతి ఇంటి వద్ద నుంచి సాయి ఇంటి వరకు రూ.5 లక్షల వ్యయంతో కొత్త పైపులైను పనులు చేపట్టారు. ఈ పనులన్నీ రెండు రోజుల్లో పూర్తిచేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

సమాజ సేవలో ది విశాఖ పట్టణం కో ఆపరేటివ్ బ్యాంక్

మంగళగిరి: లాభాల కోసం కాకుండా సమాజం కోసం, సామాన్య ప్రజల కోసం ఏర్పాటు చేసిన బ్యాంకు ది విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అని చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో మంగళగిరి బ్రాంచి సభ్యుల మహాసభ మంగళవారం జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సైతం బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో సభ్యులే బ్యాంకుకు యజమానులుగా ఉన్నారన్నారు. బ్యాంకు స్థాపించి 107 సంవత్సరాలు పూర్తి చేసుకుని రూ.500 కోట్ల సొంత నిధులతో, 14 సొంత భవనాలతో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రమణ్యం, మంగళగిరి బ్రాంచి మేనేజర్ కేవీవీ ఫణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.